క్లుప్తంగా

కార్మెల్‌మాతను దర్శించుకున్న భక్తులు



ఫిరంగిపురం: కోరిన కోరికలు తీర్చేమాత కార్మెల్‌మాత అని చోడవరం విచారణ గురువులు సర్వప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని కార్మెల్‌కొండపై ఉన్న కార్మెల్‌మాతను మరియ మాత దీక్షాదారులు 80 మంది శనివారం దర్శించుకున్నారు. అనకాపల్లి జిల్లా చోడవరం నుంచి రెండు బస్సుల్లో వచ్చిన దీక్షాదారులు కొండను ఎక్కి కార్మెల్‌మాతను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఫాదర్ సర్వప్రసాద్ ప్రార్థనలు చేశారు.

క్రమశిక్షణతో ఉన్నతస్థానం

ఫిరంగిపురం: క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నతస్థానం పొందవచ్చని సిస్టర్ నిర్మలమేరి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ నిర్మలామేరి మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఉన్నత చదువులతో పాటు ఉన్నత ఉద్యోగాలు పొందవచ్చని చెప్పారు.

మహిళా సాధికారతే లక్ష్యం

తాడేపల్లిరూరల్: మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేయాలని, మహిళలు ఆర్థికంగా ఎదగాలని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ ఉదయ అన్నారు. శనివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కమ్యూనిటీ హాల్‌లో స్వయం కృషి మహిళా కో ఆపరేటివ్ సభ్యుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో స్వయం కృషి కో ఆపరేటివ్ సభ్యులు దాసరి నాగలక్ష్మి, వి.కోటేశ్వరమ్మ, గుడ్ షెపర్డ్ ప్రతినిధులు అత్తోట పోతురాజు, కె.కార్తీక్ పాల్గొన్నారు.

జోసిల్ కంపెనీలో జాతీయ భద్రతా వారోత్సవాలు

మేడికొండూరు: మండల పరిధిలోని డోగిపర్రు జోసిల్ కంపెనీలో శనివారం జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈనెల 4 నుంచి నిర్వహిస్తున్న ఉత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కంపెనీ సెక్రటరీ రఘురామ్ మాట్లాడుతూ కంపెనీ భద్రతా కోసం కంపెనీ యాజమాన్యం రూ.లక్షలు వెచ్చించి ప్రమాద నియంత్రణ సామర్థ్యాన్ని అందుబాటులో ఉంచారన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రొడక్షన్ జనరల్ మేనేజర్ జానీబాషా మాట్లాడారు. సిబ్బందికి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.

వైభవంగా సోమేశ్వరస్వామి
కల్యాణ మహోత్సవం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరంలోని సోమేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా సోమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ ఆలయ కార్యనిర్వహణాధికారి బి.శివారెడ్డి ఆధ్వర్యంలో దాతలు అంబటి వెంకటేశ్వర రావు, అరుణ దంపతులు, అంబటి తిరుపతిరావు, శబరి దంపతులు, అంబటి రఘురాం, అరుణ కుమారి దంపతులు కల్యాణంలో కూర్చున్నారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

నిత్య కైంకర్యాలు, హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.



సోమేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

క్రీడాకారుడిని అభినందించిన ఎంపీ విజయసాయిరెడ్డి

తాడేపల్లిరూరల్: అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు రాజుకుమార్‌ను రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి అభినందించారు. తాడేపల్లిలో ఉన్న ఎంపీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డిని క్రీడాకారుడు రాజుకుమార్ కలిశారు. అతనిని ఎంపీ అభినందించారు. పల్నాడు జిల్లా నరసరావు పేట మండలం పీసపాడు గ్రామానికి చెందిన బాక్సింగ్ క్రీడాకారుడు రాజుకుమార్ అంతర్జాతీయ పోటీలలో రజిత పతకాన్ని, జాతీయ స్థాయిలో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. కోచ్ విజయకుమార్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి వచ్చిన రాజుకుమార్ 32 దేశాల్లో జరిగిన బాక్సింగ్ క్రీడలో పాల్గొని తెలుగు వాడి సత్తా చాటి పతకాలు సాధించాడని, క్రీడాకారులను ప్రభుత్వం మరింత ఆదరించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మన ఖ్యాతిని చాటేవిధంగా ప్రయత్నం చేయాలని ఆయన అన్నారు.



అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు రాజుకుమార్‌ను అభినందిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి

పెదపాలెం అభివృద్ధికి చర్యలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం గ్రామంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశారు. దానిలో భాగంగా బీసీ కాలనీలో రోడ్లు, కల్వర్టులు నిర్మించేందుకు తన సొంత నిధులతో పాటు సీఎండీఎఫ్ నిధులు కేటాయించారు. దీంతో శనివారం పనులను బీసీ నాయకులు శంకుస్థాపన చేశారు. దుగ్గిరాల బీసీ కాలనీలో ఎమ్మెల్యే రూ.1,50,000తో సీసీ రహదారి నిర్మిస్తుండగా, ఎస్సీ కాలనీలో సీఎండీఎఫ్ నిధులు రూ.11 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణానికి స్థానికులు భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో మైనింగ్ నిధుల నుంచి లక్ష రూపాయలు కేటాయించి రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నారు. పెదపాలెం అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిన ఎమ్మెల్యే ఆర్కేకు, అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్థానికులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: నూతక్కి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అక్కల సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి పట్టణ, మండలంలోని ప్రాంతాల్లోని అన్ని రూరల్ గ్రామాలకు, మంగళగిరి మండల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని కోరారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు తాడేపల్లి పట్టణ, మండలంలోని అన్ని రూరల్ గ్రామాలకు, మంగళగిరి మండల పరిధిలోని నూతక్కి, రామచంద్రాపురం, కొత్తపాలెం, పెదవడ్లపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యం చేకూరుతుందని నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యురాలు యానీగ్రేస్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ యానీగ్రేస్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం ఎంసీపీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రోజా, ఎంఎల్‌హెచ్‌పీజ్యోతి, అంగన్‌వాడీలు జ్యోతి, ఉదయలక్ష్మి, నవరాణి పాల్గొన్నారు.

113తాళ్లూరులో ర్యాలీ..

మండలంలోని 113 తాళ్లూరులో పోషణ పక్వాడా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి మాట్లాడుతూ గర్భం ధరించినప్పటి నుంచి బిడ్డ పుట్టి రెండేళ్లు వచ్చేంత వరకు ఈకాలంలో తీసుకునే ఆహారం, ఆరోగ్య సంరక్షణ వెయ్యిరోజుల సంరక్షణతో సమానం అని చెప్పారు. తల్లిపిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. వాటి వివరాలు తెలిపేదే ఎంసీపీ కార్డులని వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి ఎం.రోశయ్య, ఏఎన్‌ఎం సరోజినీ పాల్గొన్నారు.

తాడికొండలో..

తాడికొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తోందని తాడికొండ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్ వైజర్ కె కృష్ణ కుమారి అన్నారు. పోషక పక్వాడా పక్షోత్సవాలలో భాగంగా తాడికొండ సెక్టార్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారం తినడం వలన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు విలువలు కలిగిన పోషకాలు అందుతాయన్నారు. ఏకాగ్రత పెరుగుతుంది కనుక అంగన్ వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం అందరూ ఉపయోగించాలని సూచించారు. ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. పొన్నెకల్లులో నిర్వహించారు.

కళావేదిక వంట నిర్మాణానికి సాయం

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో కమ్యూనిటీ హాల్ ఆవరణలో వంటశాల, కళావేదిక నిర్మించిన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా నాయకులు కత్తిక రాఘవరావును శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతి వారు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు గతంలో ఇదే కుటుంబానికి చెందిన కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి) కళ్యాణ మండపాన్ని నిర్మించగా, ప్రభుత్వ సహకారంతో ఎమ్మెల్యే ఆర్కే ప్రహరీ, బోరును ఏర్పాటు చేసి అభివృద్ధి చేశారు. ఇప్పుడు కత్తిక పూర్ణచంద్రరావు కుమారుడు కత్తిక రాఘవరావు కళ్యాణ మండపం ఆవరణలో కళావేదికను నిర్మించడంతో పాటు వంటగదిని కూడా నిర్మించినట్లు చెప్పారు. సుమారు 3 లక్షలు ఖర్చు అయిందని వారు తెలిపారు. అనంతరం కత్తిక రాఘవరావు కుటుంబ సభ్యులు కళావేదికను, వంటశాలను ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కత్తిక రాఘవరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వడ్డేశ్వరం పార్టీ అధ్యక్షులు గొడవర్తి శ్రీనివాసరావు, అనపర్తి రాంబాబు, జెసియస్ కన్వీనర్ షేక్ మీరాషా, మండల సెక్రటరి అన్నపురెడ్డి రాంబాబు, కూనపురెడ్డి శ్రీనివాసరావు, బిఎల్ఎస్ శాస్త్రి, యస్.గురుస్వామి, బాబి, విజయ్, పూర్ణ, యస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాడేపల్లిలో పోలీస్ కవాతు



తాడేపల్లిరూరల్: సార్వత్రిక ఎన్నికలలో ప్రశాంత వాతావరణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని పోలీసులు కోరారు. శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లి సీఐ మధుసూదనరావు మాట్లాడుతూ ఎన్నికలపై, ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ కవాతు నిర్వహిస్తున్నామని, తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇప్పటం, కుంచనపల్లి, వడ్డేశ్వరం ప్రాంతాల్లో తాడేపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బందితో పాటు సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కు వినియోగించుకోవడంపై ప్రజలకు వివరించామని, ప్రతి ప్రాంతంలోను, ప్రతి బూత్‌లోను ఓటు హక్కు వినియోగించుకునేవిధంగా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరిగే విధంగా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సీఐ అజిత్ కుమార్, తాడేపల్లి ఎస్ఐలు రమేష్, ప్రతాప్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిద్ధం సభను జయప్రదం చేయండి

మేడికొండూరు: మేదరమెట్లలో సమీపంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్న సిద్ధం సభను జయప్రదం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్రామాల నుంచి కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్‌బాజీ, పార్టీ గ్రామ అధ్యక్షుడు కొరివి చెన్నయ్య, కో ఆప్షన్ సభ్యులు చంటి, బాజీ, సొసైటీ సభ్యులు పాములపాటి జయరావు, ఎంపీటీసీ సభ్యుడు కొలకలూరి సాంబ్రాజ్యం, కె.నాగేశ్వరరావు, బుర్రా వెంకటసుబ్బారెడ్డి, ఉడతా ప్రభాకర్, రాజేంద్రప్రసాద్, రోశయ్య, ప్రభాకర్, ప్రత్తిపాటి వీరయ్య, జవహర్, యోహాను, లాం రాయప్ప, మేడికొండూరు వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహాయం

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని మెల్లెంపూడికి చెందిన ఇద్దరు రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి శనివారం ఆర్థిక సహాయాన్ని ప్రకటించి నాయకులు బొమ్మారెడ్డి రాజారామిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున అందించారు. కార్యక్రమంలో దొంతిరెడ్డి వెంకట శివరామకృష్ణారెడ్డి(నాని), ఉయ్యూరు శివరామిరెడ్డి, షేక్ నాగులు, షేక్ బాషా, అలాం బుడే, షేర్ ఖాన్, ప్రభుదాస్, సాంబయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాడికొండ: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడికొండలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. తాడికొండకు చెందిన కుందేటి సుబ్బారావు(26) అప్పుల బాధ తాళలేక శుక్రవారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు జీజీహెచ్‌కు తరలించి చికిత్స జరుగుతుండగా పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. బాధితుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు.

ఘనంగా వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని రామచంద్రాపురంలో వీరభద్ర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయంలోని మూల మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీ గోవిందమాంబ, శ్రీ బ్రహ్మంగారి కళ్యాణ మహోత్సవంలో భీమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, జ్యోతి భార్గవి దంపతులు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వాహకులు, మాజీ సర్పంచి భీమిరెడ్డి అంజిరెడ్డి పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.